కామారెడ్డి బార్ అసోసియేషన్ సందర్శన

బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ సునీల్‌గౌడ్‌ను సన్మానిస్తున్న కామారెడ్డి బార్ అసోసియేషన్ సభ్యులు

కామారెడ్డి, ఏప్రిల్ 30 : కామారెడ్డి బార్ అసోసియేషన్‌ను బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ సునీల్‌గౌడ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించిన న్యాయవాదుల సమావేశంలో న్యాయవాదులు తమతమ అభిప్రాయాలు, సమస్యలు, సూచనలు తెలియజేశారు. వెంటనే 41-ఏ సీఆర్‌పీసీ ని రద్దు చేయాలని, న్యాయవాదులకు హెల్త్ కార్డులు జారీచేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. దవాఖానలో అన్ని వ్యాధులకు హెల్త్ కార్డు ఉపయోగపడేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద రమేశ్, ప్రధాన కార్యదర్శి బండారి సురేందర్ రెడ్డి, కార్యదర్శి మోహన్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు క్యాతం సిద్ధిరాములు, దేవరాజ్ గౌడ్, గజ్జెల భిక్షపతి, గోవింద్ రావు, జయప్రకాశ్, జోగుల గంగాధర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా మహిళా కమిషన్ మెంబర్ సూదం లక్ష్మి

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 30 : నస్రుల్లాబాద్ మండల కేంద్రంలోని 1వ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం బాలలు, మహిళల హక్కుల చట్టాలపై ఉమ్మడి జిల్లా మహిళా కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు అన్నింటిలో ముందుండాలని అన్నారు. మహిళలకు ఏమైన ఇబ్బందులు ఎదురైతే టోల్ ఫ్రీ నంబర్లకు 1098, 181, 100 ఫోన్ చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో ప్రమీల, సీడీపీవో సౌభాగ్య, సూపర్‌వైజర్ వాణీ, అగన్‌వాడీ టీచర్లు గంగామణి, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 30 యాక్ట్ అమలు

కామారెడ్డి, ఏప్రిల్ 30 : జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ 1861ని అమలు చేస్తున్న ఎస్పీ రాజేశ్‌చంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా మే 1 నుంచి 31వ తేదీ వరకు 30 యాక్ట్, పోలీసు యాక్ట్ 1861 జిల్లాలో అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు ఎవరైనా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించాలనుకుంటే స్థానిక పోలీసు స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలని సూచించారు. అనుమతి లేకుండా నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భూభారతిలో రెండంచెల అప్పీలు వ్యవస్థ

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

లింగంపేట(తాడ్వాయి)/రాజంపేట/కామారెడ్డి రూరల్, ఏప్రిల్ 30 : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న భూభారతి చట్టంలో రెండంచెల అప్పీలు వ్యవస్థ అందుబాటులో ఉందని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ రైతులకు సూచించారు. తాడ్వాయిలోని రైతువేదికలో బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చట్టంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు అన్ని పరిష్కరించనున్నట్లు తెలిపారు. హక్కుల రికార్డులో ఉన్న రైతుకు లైసెన్సు ఉన్న సర్వేయర్‌తో సర్వే చేసుకొని మ్యాప్ తయారు చేయించుకోవచ్చని తెలిపారు. భూ సమస్యలు ఉన్న రైతులు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకుంటే నిర్ణీత సమయంలో విచారణ చేపట్టి పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రాజారాం, కామారెడ్డి ఆర్డీవో వీణ, సహకార సంఘం చైర్మన్ కపిల్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ముదాం నర్సింహులుతో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు సమస్యల పరిష్కారం

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వ ఆదేశాల మేరకు సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సూచించారు. లింగంపేట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. లింగంపేట మండలాన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేసి 17 నుంచి 30వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. 23 గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో 3,700 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. రైతులు చేసుకున్న దరఖాస్తులు చట్ట ప్రకారం విచారణ చేపట్టి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. దరఖాస్తులపై విచారణ చేపట్టడానికి తొమ్మిది బృందాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బృందంలో తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, సర్వేయర్లను నియమించినట్లు తెలిపారు. ప్రతి బృందం సభ్యులు 400 దరఖాస్తులు విచారణ చేపట్టనున్నట్లు వివరించారు. మండలంలో విచారణ చేపట్టడానికి పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని కలెక్టర్ తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, భూభారతి ప్రత్యేకాధికారి రాజేందర్, తహసీల్దార్ సురేశ్‌తోపాటు రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు. రాజంపేటలోని రైతు వేదికలో భూభారతిపై అవగాహన సదస్సును నిర్వహించారు. కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఆర్డీవో వీణ, మండల ప్రత్యేకాధికారిణి అపర్ణ, తహసీల్దార్ సతీశ్‌రెడ్డి, ఎంపీడీవో రఘురాం, నయాబ్ తహసీల్దార్ సంతోషి, ఏవో శృతి, రెవెన్యూ సిబ్బంది, సొసైటీ చైర్మన్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి రైతువేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

రైతులు సాగు చేసిన ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తాడ్వాయిలోని తహసీల్ కార్యాలయంలో బుధవారం మంత్రులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌తో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. అకాల వర్షాలు కురుస్తున్నందున రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం సేకరణ చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు ఉంటే వాటిని వెంటను పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మాట్లాడుతూ.. జిల్లాలోని ఆయా మండలాల్లో ఏర్పాటు చేసిన 446 కొనుగోలు కేంద్రాల్లో 22,785 మంది రైతుల నుంచి 1,81,776 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వివరించారు. 59,354 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం వడ్లు, 1,22,422 మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం కొనుగోలు చేసినట్లు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మల్లికార్జున్, పౌర సరఫరాల శాఖ మేనేజర్ రాజేందర్, జిల్లా సహకార శాఖ అధికారి రామ్మోహన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్, డీఆర్డీవో సురేందర్, సీపీవో రాజారాం, జిల్లా పంచాయతీ అధికారి మురళి, మార్కెటింగ్ అధికారి రమ్య, కామారెడ్డి ఆర్డీవో వీణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

వర్షాలు సమృద్ధిగా కురవాలని పూజలు

బాన్సువాడ రూరల్, ఏప్రిల్ 30 : అక్షయ తృతీయను పురస్కరించుకొని ఈ సంవత్సరం పుష్కలంగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ బుధవారం బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామస్తులు జోడేడ్లతో శోభాయాత్రను నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో తరలి వచ్చి ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం గ్రామ శివారులో ప్రత్యేక పూజలు నిర్వహించి దుక్కిలు దున్నారు. గ్రామపెద్దలు బస్వరాజ్, బలరాం, మల్లారెడ్డి, బస్వారెడ్డి, గాండ్ల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

బోర్లంలో జోడేడ్లతో ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

ఫాంపాండ్స్ నిర్మించుకునేలా ప్రోత్సహించాలి

లింగంపేట, ఏప్రిల్ 30 : గ్రామాల్లోని వ్యవసాయ బోరు బావుల వద్ద ఫాంపాండ్స్ నిర్మించుకునేలా రైతులను ప్రోత్సహించాలని ఎంపీడీవో నరేశ్ సూచించారు. లింగంపేట మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులతో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నందున బోర్లలో నీరు అడుగంటి పోతున్నందున బోరు బావులు వద్ద ఫాంపాండ్స్ నిర్మించుకునేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ఫాంపాండ్స్ నిర్మాణాలతో కలిగే లాభాల గురించి రైతులకు వివరించాలని సూచించారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి మల్లూరీ, ఏపీవో నరేందర్‌తోపాటు ఆయా పంచాయతీల కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీడీవో నరేశ్

విద్యార్థి అదృశ్యం

కామారెడ్డి, ఏప్రిల్ 30 : పట్టణంలోని పెద్ద బజారుకు చెందిన విద్యార్థి అదృశ్యమైనట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పెద్ద బజార్‌కు చెందిన మామిండ్ల రవీంద్ర నిఖిల్ గత నెల 28న ఉదయం 11 గంటలకు ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. తల్లి మామిండ్ల నందిని ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ తెలిపారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి

మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ రూరల్, ఏప్రిల్ 30 : ప్రతి ఉద్యోగికి విధి నిర్వహణలో ఉద్యోగ విరమణ తప్పని సరి అని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్ ఉద్యోగ విమరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనకు శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో సత్యనారాయణరెడ్డి, వివిధ శాఖల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ..

బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి దళిత నాయకులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమం లో మాజీ సర్పంచు నారాయణరెడ్డి, దళిత సంఘం నాయకులు నెర్రె నర్సింహులు, బంగారు మైశయ్య, శివయ్య, మన్నె చిన్న సాయిలు, నాగభూషణం, మోహన్, నాయకులు పాల్గొన్నారు.

'గుర్తింపులేని ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించొద్దు'

బాన్సువాడ రూరల్, ఏప్రిల్ 30 : ప్రభుత్వ గుర్తింపు లేని ప్రైవేటు పాఠశాలల్లో తల్లిదండ్రులు పిల్లలను చేర్పించొద్దని ఎంఈవో నాగేశ్వర్‌రావు అన్నారు. మండల విద్యావనరుల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాన్సువాడ పట్టణం, బాన్సువాడ రూరల్ పరిధిలో మొత్తం 22 గుర్తింపు పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. గుర్తింపు లేని పాఠశాల యాజమాన్యాలు అడ్మిషన్లు చేసుకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సైబర్ నేరాల బారినపడి మోసపోవద్దు

బాన్సువాడ, ఏప్రిల్ 30 : సైబర్ నేరాల బారిన పడి మోసపోవద్దని బాన్సువాడ షీటీం సభ్యులు ప్రియాంక, అనిల్ యువతి, యువకులకు సూచించారు. పట్టణంలోని గ్రంథాలయంలో బుధవారం షీటీం ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతి, యువకులకు షీటీం సభ్యులు పలు అంశాల గురించి వివరించారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సభ్యులు

విగ్రహాల ఆవిష్కరణ

విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

బిచ్కుంద, ఏప్రిల్ 30 : మండలంలోని సిర్‌సముందర్ గ్రామంలో మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు సీమ గంగారాం సొంత ఖర్చుతో అందజేసిన అంబేద్కర్ విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు బుధవారం ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు గంగాధర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కవిత, వైస్ చైర్మన్ శంకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాయిని అశోక్, నాయకులు విఠల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సురేశ్ గొండ, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ

మద్నూర్, ఏప్రిల్ 30 : ఛత్రపతి శివాజీ మహరాజ్, బసవేశ్వర విగ్రహాలను బుధవారం మండలకేంద్రంలో ఆవిష్కరించారు. మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన రెండు విగ్రహాలను బిచ్కుంద బండయ్యప్ప సంస్థాన్ మఠాధిపతి సోమయప్ప, ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, మాజీ ఎంపీ బీబీపాటీల్, మాజీ ఎమ్మెల్యేలు హన్మంత్‌షిండే, గంగారాం, అరుణతారా ఆవిష్కరించారు. పూలమాలలు వేసి, మహనీయుల సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

లింగంపేట, ఏప్రిల్ 30 : లింగంపేట మండలంలోని నల్లమడుగు పెద్ద తండాకు చెందిన అర్చన (19) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు తండా వాసులు తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన అర్చన మంగళవారం హైదరాబాద్ పట్టణంలో ఈపీ సెట్ పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. పరీక్ష పూర్తి చేసుకున్న అర్చన రాత్రి బంధువుల వద్ద ఉండి బుధవారం తెల్లవారుజామున సోదరుడు అరవింద్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై స్వగ్రామమైన నల్లమడుగు తండాకు తిరిగి వస్తున్నారు. మేడ్చల్ శివారులోని రింగ్ రోడ్డు వద్ద లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టినట్లు తెలిపారు. అర్చనకు తలకు తీవ్రగాయాలు కావడంతో ఘటన స్థలంలోనే మృతి చెందింది. ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న అరవింద్‌కు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతో వృద్ధురాలు మృతి

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 30 : కుటుంబ కలహాలతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని కళ్యాణి గ్రామంలో చోటు చేసుకుంది. బుధవారం ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కళ్యాణి గ్రామానికి చెందిన బండారి విఠవ్వ (62)కు మంగళవారం ఇంటి వద్ద కొడుకు సాయిలు, కోడలు కాశవ్వలతో గొడవ జరిగింది. కొద్ది సేపటికి విఠవ్వ రక్తపు వాంతులు చేసుకోవడంతో భర్త సాయన్న ఏమైందని అడుగగా బాత్‌రూంలోని యాసిడ్ తాగినట్లు తెలిపింది. వెంటనే విఠవ్వను చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు అక్కడి నుంచి బాన్స్‌వాడ ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త సాయన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గాలీపూర్‌లో కిరాణా షాపు దగ్ధం

నిజాంసాగర్, ఏప్రిల్ 30 : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కిరాణా దుకాణంలో అగ్నిప్రమాదం చోటు చేసుకున్న ఘటన మహ్మద్‌నగర్ మండలం గాలీపూర్ గ్రామంలో బుధవారం చోటు చేసుకున్నది. బాధితుడు గంజి రాజు తెలిపిన వివరాల ప్రకారం ఎలక్ట్రిక్ బోర్డులో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు రావడంతో దట్టమైన పొగ వ్యాపించి దుకాణమంత కాలిపోయింది. స్థానికులు స్పందించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. కిరాణా షాపులో ఉన్న వస్తువులు పూర్తిగా కాలిపోవడంతో రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు దుకాణదారుడు తెలిపాడు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఎస్సెస్సీ ఫలితాల్లో సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఏప్రిల్ 30 : రాష్ట్ర ప్రభుత్వ బుధవారం విడుదల చేసిన ఎస్సెస్సీ ఫలితాల్లో ఎల్లారెడ్డి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. మండలంలో 18 ప్రభుత్వ పాఠశాలల్లోని 964 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయగా, 885 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. పదో తరగతి పరీక్షలో ఎల్లారెడ్డి మండలంలో 94.09 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖాధికారి రాజులు తెలిపారు. తాడ్వాయి మండలంలో పదో తగతిలో 98 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖ అధికారి రామస్వామి తెలిపారు. మండలంలోని ఆయా పాఠశాలలకు చెందిన 478 విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 468 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో చదివిన రమేశ్ 587 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచినట్లు తెలిపారు. జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో చదివిన మౌర్యనంద్‌రెడ్డి 581 మార్కులు సాధించి ద్వితీయ టాపర్‌గా నిలిచినట్లు ఆయన తెలిపారు. లింగంపేట మండలంలో పదో తరగతి పరీక్షల్లో 99 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖ అధికారి శౌకత్ అలీ తెలిపారు. మండలంలోని 17 ఉన్నత పాఠశాలలకు సంబంధించి 542 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 534 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. 13 ప్రభుత్వ పాఠశాలలకు గాను 10 ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. రెండు గురుకుల పాఠశాలల్లో సైతం వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన నిక్షయ్ 581 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచినట్లు తెలిపారు. బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి తేజస్వీని 576 మార్కులు, మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన రాహుల్ 575 మార్కులు సాధించిన మండల స్థాయిలో టాపర్లుగా నిలిచినట్లు తెలిపారు. సదాశివనగర్ మండలం కల్వరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల చెందిన భవిత 581 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచినట్లు మండల విద్యాధికారి యెసెఫ్ తెలిపారు. రామారెడ్డి మండలంలోని ఉప్పల్‌వాయి గురుకుల పాఠశాల విద్యార్థి తరుణ్‌తేజ్ 571 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ శివరాం తెలిపారు. రాజంపేట మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులు గుర్రాల వర్షశ్రీ 552 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానం, మరో విద్యార్థిని తండురి మానస 549, రాజంపేట బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన దుబ్బని ప్రనీత్ 549, తలమడ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని మొటాటి లిఖిత 549 మార్కులు సాధించి మండల స్థాయిలో రెండో స్థానంలో నిలిచారని మండల విద్యాధికారి పూర్ణచంద్రరావు తెలిపారు. ఉమ్మడి మాచారెడి మండలంలోని 13 ప్రభుత్వ పాఠశాలు, బీబీపేట్, దోమకొండ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు సత్తాచాటారని ఎంఈవో కార్యాలయ సిబ్బంది తెలిపారు. భిక్కనూరు మండలం జంగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని మాడ్గుల సహస్ర 576 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిందని ఎంఈవో రాజా గంగారెడ్డి తెలిపారు. నిజాంసాగర్ మండలంలో పదో తరగతి ఫలితాల్లో టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ విద్యార్థులు మండల టాపర్‌గా నిలిచారు. రవి 565 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. పులిరాజు 539 మార్కులు సాధించి మండల సెకండ్ టాపర్‌గా నిలిచినట్లు ప్రిన్సిపాల్ జనార్దన్ తెలిపారు. మహ్మద్‌నగర్ మండలం సింగీతం ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని నిహారిక 540 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. మహ్మద్‌నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని రోజా 533 మార్కులు సాధించి మండల సెకండ్ టాపర్‌గా నిలిచినట్లు ఉమ్మడి మండలాల మండల విద్యాధికారులు తిరుపతిరెడ్డి, అమర్‌సింగ్ తెలిపారు. పెద్దకొడప్‌గల్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల విద్యార్థులు మండల స్థాయిలో మొదటి, రెండో, మూడో స్థానంలో నిలిచారు. గురుకుల పాఠశాల విద్యార్థినిలు లావణ్య (541) ప్రథమ స్థానం, అర్చన (540) రెండో స్థానం, రాజేశ్వరీ (537) మార్కులు సాధించినట్లు మండల విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కాటేపల్లి జిల్లా పరిషత్ పాఠశాల 100 శాతం సాధించినట్లు తెలిపారు. పిట్లంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థిని రక్షిత 579 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. మలిహ మహెక్ 576 మార్కులు సాధించి రెండో స్థానం సాధించినట్లు మండల విద్యాశాఖ అధికారి దేవీసింగ్ తెలిపారు.

బసిరెడ్డి గాయత్రి

హిమగిరి

బామన్ రమేశ్

నిక్షయ్

భవిక

గుర్రాల వర్షశ్రీ

సహస్ర

లావణ్య

రక్షిత

ఘనంగా బసవేశ్వర మహరాజ్ జయంతి

బిచ్కుందలో బసవేశ్వర చిత్ర పటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డి రూరల్/బాన్సువాడ రూరల్/బిచ్కుంద, ఏప్రిల్ 30 : ఎల్లారెడ్డి పట్టణంలో మహాత్మా బసవేశ్వర జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. నీలకంఠేశ్వరునికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం, స్థానిక బసవేశ్వరచౌక్ వద్ద వీరశైవ లింగాయత్ సమాజ్ సభ్యుల ఆధ్వర్యంలో బసవేశ్వర జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజ్ మండల అధ్యక్షుడు ముత్తి వీరప్ప, ప్రధాన కార్యదర్శి కపిల బసప్ప, సభ్యులు నాయికోటి శేఖరప్ప, జంగం పెద్ద సంగప్ప, వీరసంగప్ప, ముత్తి రామప్ప, జంగం వీరప్రసాద్, అశోక్, అనీల్, రాధిక, శాంత తదితరులున్నారు.

బాన్సువాడ మండలంలోని దేశాయిపేట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వీరశైవ లింగాయత్‌ల ఆరాధ్య దైవం బసవేశ్వర్ జయంతిని బుధవారం నిర్వహించారు. అధ్యాపకులు విఠల్, శ్రీనివాస్, బాషా, శంకర్రావు, అంబయ్య, బాలరాజు, వినయ్‌కుమార్, చిరంజీవి, మోహన్ రావు, పురుషోత్తం, గోపాల్, భీమయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. బిచ్కుంద మండల కేంద్రంలో బసవేశ్వర జయంతిని నిర్వహించారు. రాజుల్లా చౌరస్తాలో మఠధిపతి సద్గురు సోమయప్ప స్వామి జెండాను ఆవిష్కరించారు. అనంతరం మండల కేంద్రంలో బైక్ ర్యాలీని ప్రధాన వీధుల గుండా అంబేద్కర్ చౌరస్తా నుంచి శివాజీ చౌక్‌మీదుగా బస్టాండ్, తక్కడ్‌పల్లి రోడ్డులోని బొర్ర గణపతి ఆలయంకు నిర్వహించారు. అనంతరం సీనియర్ నాయకుడు మల్లికార్జున్ అప్ప బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సాహిల్ షెట్కార్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అశోక్, లింగాయత్ సమాజ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.